సాక్షి
అనంతపురం
బుధవారం । 26 ఏప్రిల్ । 2023



చీనీ టన్ను రూ.40 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠ ధర రూ.40 వేలు పలికాయి.



టమాట కిలో రూ.5

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట ధర గరిష్ఠంగా రూ.5, కనిష్ఠంగా రూ.2.50, సరాసరిన రూ.3.50 పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
$41.2^{\circ}/24.4^{\circ}$

జిల్లా అంతటా మంగళవారం పగలు. రాత్రి ఉష్ణోగ్రతలు గరిష్ఠంగా నమోదయ్యాయి. ఉక్కపోత తీవ్రంగా ఉంది. ఆకాశం మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి.

న్యూస్‌రీల్

5 రోజుల్లో తేలిక పాటి వర్షాలు



బుక్కరాయసముద్రం: జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని రేకులకుంటలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ సహదేవరెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త అశోక్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పగటి ఉష్ణోగ్రతలు పెద్దఎత్తున పెరగవచ్చునని పేర్కొన్నారు. మధ్యాహ్నం 39.8–40.8, రాత్రి 26 –27.1 డిగ్రీల మధ్య నమోదవుతాయని తెలిపారు.

వేపరాళ్లలో పారిశ్రామిక పార్కు



అనంతపురం టౌన్: రాయదుర్గం ప్రాంతాన్ని పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇప్పటికే జీన్స్ తయారీ పరిశ్రమలకు ఈ ప్రాంతం కేంద్ర బిందువుగా ఉంది. ఇక్కడ తయారైన జీన్స్ ఉత్పత్తులు ఇతర రాష్ట్రాలకు సైతం ఎగుమతులు చేస్తున్నారు. జీన్స్ పరిశ్రమను మరింతగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందులో భాగంగా రాయదుర్గం మండలం వేపరాళ్ల సమీపంలో దాదాపు 100 ఎకరాల విస్తీర్ణంలో పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు ఏపీఐఐసీ అధికారులు వేపరాళ్లలో ప్రభుత్వ భూమితోపాటు ప్రైవేట్ భూములను సైతం సేకరించారు. పారిశ్రామిక పార్కు అనుమతి కోసం రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలను పంపారు. అక్కడి నుంచి అనుమతులు రాగానే ఏపీఐఐసీ అధికారులు పరిశ్రమల కోసం కేటాయించిన స్థలాల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు.

అనుమతులు రాగానే పనులు

రాయదుర్గం మండలంలో 100 ఎకరాల విస్తీర్ణంలో ఒకటి, కూడేరు మండల పరిధిలో 400 ఎకరాల్లో మరో భారీ పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ వరప్రసాద్‌రావు తెలిపారు. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు రాగానే అభివృద్ధి పనులు చేపట్టి పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే యువ పారిశ్రామిక వేత్తలకు స్థలాలను కేటాయించే ప్రక్రియ చేపడతామన్నారు.

ఖరీఫ్‌కు సంసిద్ధం కావాలి



మాట్లాడుతున్న డీఏఓ చంద్రానాయక్

గుంతకల్లు రూరల్/వజ్రకరూరు: ఖరీఫ్ పంటల సాగు సమయం దగ్గర పడుతున్నందున వ్యవసాయ శాఖ సిబ్బంది సంసిద్ధం కావాలని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) చంద్రానాయక్ సూచించారు. మంగళవారం గుంతకల్లు మార్కెట్ యార్డులోని రైతు భరోసా కేంద్రంలో ఆయన వ్యవసాయ శాఖ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. పీఎం కిసాన్‌కు సంబంధించి ఈ–కేవైసీ పూర్తి చేయాలన్నారు. ఖరీఫ్‌కు అవసరమైన ఎరువులను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. భూసార పరీక్షల ప్రాముఖ్యతను రైతులకు వివరిస్తూ, ప్రతి ఒక్కరూ భూసార పరీక్షలు చేయించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ స్వాతి పాల్గొన్నారు.

40 శాతం రాయితీతో డ్రోన్ యంత్రాలు

ఆసక్తి ఉన్న రైతులకు 40 శాతం రాయితీతో డ్రోన్ యంత్రాలను అందజేయనున్నట్లు డీఏఓ చంద్రానాయక్ తెలిపారు. వజ్రకరూరులో వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆర్‌బీకే సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు నార్పలకు సీఎం జగన్





- 'వసతి దీవెన'ను ప్రారంభించనున్న ముఖ్యమంత్రి

నార్పలలో సిద్ధమైన సీఎం సభా ప్రాంగణం

శింగనమల/ నార్పల: ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తొలిసారి బుధవారం శింగనమల నియోజకవర్గం నార్పలకు వస్తున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభ నుంచే జగనన్న వసతి దీవెన పథకం నగదును విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి కంప్యూటర్ బటన్ నొక్కి జమ చేయనున్నారు. ఇప్పటికే అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయించారు.

ఏర్పాట్ల పరిశీలన

సీఎం పర్యటన ఏర్పాట్లను మంత్రి ఉషశ్రీ చరణ్, ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ తలశిల రఘురాం, ప్రభుత్వ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకుడు రాజారెడ్డి పరిశీలించారు. నార్పలలోని బాలుర హైస్కూల్‌లోని హెలిప్యాడ్‌తో పాటు సభా ప్రాంగణం వరకు రోడ్డు మార్గాన్ని పరిశీలించారు. వసతి దీవెన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి ఉషశ్రీచరణ్, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, లబ్ధిదారులకు పిలుపునిచ్చారు. శింగనమల నియోజకవర్గ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎమ్మెల్యే పద్మావతి తెలిపారు.

38 గ్యాలరీల ఏర్పాటు

జగనన్న వసతి దీవెన కార్యక్రమానికి వచ్చే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు కూర్చోవడానికి 38 గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ప్రతి గ్యాలరీకి కుర్చీలు, ఎండ వేడిమి లేకుండా కూలర్లు ఏర్పాటు చేశారు. మజ్జిగ, నీళ్ల బాటిళ్లు అందించేందుకు సిద్ధంగా ఉంచారు. సభా ప్రాంగణంలో ఇబ్బందులు కలగకుండా చూసేందుకు పంచాయతీరాజ్, రెవెన్యూ సిబ్బందిని నియమించి జెడ్పీ సీఈఓ భాస్కర్‌రెడ్డి, డీపీఓ ప్రభాకర్‌రావు, ఆర్డీఓ మధుసూదన్‌లు దిశా నిర్దేశం చేశారు. ముఖ్యమంత్రి సభా ప్రాంగణం వద్ద ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దాదాపు 1200 మంది పోలీసులను విధులకు కేటాయించారు. కార్యక్రమంలో ఏడీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత, ఎంపీపీ నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ రఘునాథరెడ్డి, అనంతపురం మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

సీఎం పర్యటన సాగేదిలా..

- ఉదయం 9.45 గం :సీఎం జగన్ శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు.
- 10 గం : పుట్టపర్తి నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరుతారు.
- 10.20: నార్పల ప్రభుత్వ బాలుర హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.
- 10.20 నుంచి 10.30 వరకు: ప్రజాప్రతినిధులతో మాట్లాడతారు.
- 10.30 : నార్పల క్రాస్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగసభాస్థలికి రోడ్డు మార్గంలో బయల్దేరుతారు.
- 10.40 : సభాస్థలి వద్దకు చేరుకుంటారు
- 10.40 నుంచి 10.55 వరకు: ఫొటో గ్యాలరీని తిలకిస్తారు
- 11 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు : వేదికపై వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తారు. లబ్ధిదారులతో ముఖాముఖి. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. తర్వాత జగనన్న వసతి దీవెన మెగా చెక్కు విడుదల చేస్తారు
- 12.35 : సభాస్థలి నుంచి హెలిప్యాడ్ వద్దకు బయల్దేరుతారు.
- 12.45 నుంచి 1.05 వరకు : హెలిప్యాడ్ చేరుకుని స్థానిక నాయకులతో మాట్లాడతారు.
- 1.10 : హెలికాప్టర్‌లో పుట్టపర్తి విమానాశ్రయానికి బయల్దేరుతారు.
- 1.30: పుట్టపర్తి విమానాశ్రయం చేరుకుంటారు
- 1.40 :విమానంలో గన్నవరం బయల్దేరుతారు.



సీఎం సభా ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు వచ్చిన మంత్రి ఉషశ్రీచరణ్, ఎంపీ తలారి రంగయ్య, ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, తలశిల రఘురామ్, ఆలూరు సాంబశివారెడ్డి, పైలా నరసింహయ్య

ఉన్నత విద్యకు ఆలంబన

- 'వసతి దీవెన'తో ఆర్థిక ఉపశమనం
- నేడు నార్పలలో నగదు జమకు శ్రీకారం
- ఉమ్మడి జిల్లాలో 69,316 మంది తల్లుల ఖాతాల్లోకి 72.92 కోట్లు జమ!



అనంతపురం రూరల్: పేదింటి పిల్లలు ఉన్నత చదువులు పూర్తి చేసి ఉన్నత శిఖరాలకు చేర్చాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం. ఇందుకోసం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరించడంతో ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎంతోమంది పేద విద్యార్థులు చదువులకు దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగన్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఏ ఒక్క విద్యార్థీ చదువులకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో అమ్మ ఒడి, జగనన్న విదేశీ విద్యా దీవెన, వసతి దీవెన, విద్యా దీవెన వంటి పథకాలను ప్రవేశపెట్టారు. ప్రభుత్వ పథకాల ద్వారా ఎంతోమంది పేదలు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించుకుంటున్నారు. 'నాడు–నేడు' కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోయాయి. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా మౌలిక సదుపాయాలు, బోధనా ప్రమాణాలు మెరుగుపడటంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థుల సంఖ్య ఏటా గణనీయంగా పెరుగుతోంది. జగనన్న విద్యా దీవెన పథకం ద్వారా కళాశాలల ఫీజులు చెల్లించడంతో పాటు జగనన్న వసతి దీవెన ద్వారా భోజన, వసతి ఖర్చుల కోసం ఐటీఐ చదివే విద్యార్థులకు సంవత్సరానికి రెండు విడతల్లో రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ విద్యార్థులకు రూ.20 వేలు అందిస్తోంది. ఇప్పటికే జగనన్న విద్యా దీవెన పథకం కింద విద్యార్థుల తల్లుల ఖాతాలోకి నగదు జమ చేయగా... 2022–23 విద్యా సంవత్సరానికి 'జగనన్న వసతి దీవెన' సొమ్మును బుధవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నార్పల బహిరంగ సభలో కంప్యూటర్ బటన్ నొక్కి ఖాతాల్లోకి నగదు జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో 69,316 మంది తల్లుల ఖాతాల్లోకి రూ.72.92 కోట్ల నగదు జమ కానుంది. మొత్తం మీద ఉమ్మడి జిల్లాలో 75,987 మంది విద్యార్థులకు ఈ పథకం కింద లబ్ధి చేకూరనుంది.

ఉన్నత చదువులకు భరోసా



ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాలు ఎంతో మేలు చేస్తున్నాయి. ఈ పథకాలతో మాలాంటి పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఆర్థిక భరోసా కలుగుతోంది. చక్కగా చదువుకుంటున్నాం.

– జెర్రిపోతుల జాహ్నవి, బీఎస్సీ హార్టికల్చర్, ఓబులంపల్లి, చెన్నేకొత్తపల్లి మం.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



విద్యకు పెద్ద పీట వేస్తూ పేద పిల్లల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన సాయంతో చదువులు సాఫీగా సాగుతున్నాయి.

– మదన్, డిగ్రీ మూడో సంవత్సరం, సిండికేట్‌నగర్, అనంతపురం రూరల్

అనంతపురం జిల్లాలో జగనన్న వసతి దీవెన లబ్ధి

కులం	విద్యార్థులు	తల్లులు	నిధులు
ఎస్సీ	7,367	6,710	రూ. 7.04 కోట్లు
ఎస్టీ	1,595	1,430	రూ. 1.53 కోట్లు
బీసీ	20,234	18,426	రూ. 19.41 కోట్లు
కాపు	2,165	2,040	రూ. 2.07 కోట్లు
ఈబీసీ	5,522	5,082	రూ. 5.38 కోట్లు
ముస్లిం	3,923	3,568	రూ. 3.76 కోట్లు
క్రిస్టియన్	101	92	రూ. 0.10 లక్షలు

శ్రీసత్యసాయి జిల్లాలో...

కులం	విద్యార్థులు	తల్లులు	నిధులు
ఎస్సీ	4,683	4,280	రూ. 4.47 కోట్లు
ఎస్టీ	1,951	1,755	రూ. 1.84 కోట్లు
బీసీ	18,582	16,835	రూ. 17.83 కోట్లు
ఈబీసీ	3,684	3,441	రూ. 3.60 కోట్లు
కాపు	2,775	2,547	రూ. 2.65 కోట్లు
ముస్లిం	3,380	3,088	రూ. 3.25 కోట్లు
క్రిస్టియన్	25	22	రూ. 2.30 లక్షలు

ముగింపు దశకు టెన్త్ 'స్పాట్'

- తెలుగు, హిందీ, సైన్స్, సోషల్ సబ్జెక్టుల పూర్తి
- నేడు పూర్తి కానున్న ఇంగ్లిష్, గణితం, సంస్కృతం



పేపర్లు దిద్దుతున్న ఉపాధ్యాయులు

రాప్తాడు రూరల్: పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్) ముగింపు దశకు చేరుకుంది. ఈ నెల 19న అనంతపురంలోని కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మూల్యాంకన ప్రక్రియ ప్రారంభమైంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి మొత్తం 2,09,928 జవాబుపత్రాలు వచ్చాయి. మూల్యాంకన ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా క్యాంపు ఆఫీసరు, జిల్లా విద్యాశాఖ అధికారి సాయిరామ్, డిప్యూటీ క్యాంపు ఆఫీసర్లు శంకరప్రసాద్, గోవిందునాయక్ చర్యలు తీసుకున్నారు. అన్ని సబ్జెక్టులకు అవసరమైన మేరకు అసిస్టెంట్ ఎగ్జామినర్లను నియమించారు. ఒకొక్కరు రోజుకు 40 – 45 పేపర్లు దిద్దుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం నాటికి తెలుగు, హిందీ, సైన్స్, సోషల్ సబ్జెక్టులు పూర్తయ్యాయి. ఇంగ్లిష్, గణితం, సంస్కృతం బుధవారం పూర్తి కానున్నాయి. జిల్లాకు వచ్చిన 2,09,928 జవాబుపత్రాల్లో ఇప్పటికి 2,07,614 పత్రాలను మూల్యాంకనం చేశారు. ఇంకా 2,314 పత్రాలను పూర్తి చేయాల్సి ఉంది.

రేపటి నుంచి 'ఓపెన్' పరీక్షల 'స్పాట్'

ఈ నెల 27 నుంచి సార్వత్రిక విద్యా పీఠం (ఓపెన్ స్కూల్) ఇంటర్ జవాబుపత్రాల మూల్యాంకనం ప్రారంభం కానుంది. నాలుగు రోజుల పాటు ఈ ప్రక్రియ జరగనుంది. వివిధ జిల్లాల నుంచి మొత్తం 18 వేల జవాబుపత్రాలు జిల్లాకు వచ్చాయని డీఈఓ సాయిరామ్, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్ తెలిపారు. దాదాపు 400 మంది సిబ్బందిని నియమించారు.

మోగిన తపాలా ఉద్యోగుల సొసైటీ ఎన్నికల నగారా

అనంతపురం సిటీ: అనంతపురం డివిజన్ తపాలా ఉద్యోగుల కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికల నగారా మోగింది. ఈ మేరకు కలెక్టర్ గౌతమి ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆ శాఖ సీనియర్ ఇన్‌స్పెక్టర్/ ఎన్నికల అధికారి ఎస్.కుమార్ మంగళవారం తెలిపారు. మే ఒకటిన సంఘం కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. 2న నామినేషన్ల పరిశీలన, 3న ఉపసంహరణ, అదే రోజు సాయంత్రం 5 గంటలకు బరిలో ఉన్న అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు ఉంటుందన్నారు. అనంతపురంలోని ఆదిమూర్తి నగర్‌లో ఉన్న గిల్డ్ ఆఫ్ సరీస్ బాలికల పాఠశాలలో 7వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ పోలింగ్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. మొత్తం 11 మంది పాలకవర్గ సభ్యుల పదవులకు గాను రెండింటిని ఈడీ ఉద్యోగులు, గ్రామీణ డాక్ సేవక్‌లకు కేటాయించినట్లు తెలిపారు.

యువకుణ్ని బలిగొన్న పిడుగు



వన్నూరుస్వామి (ఫైల్)

గుమ్మఘట్ట: పిడుగుపాటుకు యువకుడు ప్రాణం కోల్పోయాడు. తన కళ్లెదుటే తనయుడు కుప్పకూలిపోవడం చూసి తల్లి తల్లడిల్లిపోయింది. వివరాలిలా ఉన్నాయి. గుమ్మఘట్ట మండలం కె.పి.కుంట గ్రామానికి చెందిన తిమ్మన్న, సన్నక్క దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు సంతానం. గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగించేవారు. మంగళవారం గ్రామశివారులోని గొర్రెల మంద వద్ద తిమ్మన్న ఉండగా.. సన్నక్క తన కూతురు పవిత్రతో కలిసి కొన్ని గొర్రెలను మేపేందుకు సమీపంలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారు. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో పెద్ద కుమారుడు వన్నూరుస్వామి (22) తల్లి, చెల్లికి భోజనం క్యారియర్ తీసుకుని వెళ్లాడు. భోజనం తిన్నాక చెల్లిని ఇంటికి పంపించేశాడు. నాలుగు గంటల సమయంలో వర్షం మొదలైంది. తల్లి సన్నక్క ఓ చెట్టు కిందకు చేరుకుంది. వన్నూరుస్వామి గొర్రెల మధ్యలో నిల్చుని ఉండగా ఉరుములు, మెరుపులతో పిడుగు పడింది. అంతే వన్నూరుస్వామి కుప్పకూలి అక్కడికక్కడే ప్రాణం విడిచాడు. తల్లి గమనించి పరుగున వచ్చి విగతజీవిగా పడి ఉన్న తనయుడిని గుండెలకు హత్తుకుని రోదించింది. భోజనం ఇప్పుడే తెచ్చిస్తివి.. అప్పుడే మమ్మల్ని విడిచి వెళ్లిపోయావా.. దేవుడా ఎంత పనిచేశావయ్యా అంటూ గుండెలవిసేలా విలపించింది. పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయదుర్గం ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

రాయితీ డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీకి ఏర్పాట్లు

అనంతపురం అగ్రికల్చర్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24)కు సంబంధించి రాయితీపై డ్రిప్, స్ప్రింక్లర్ల (బిందు, తుంపర సేద్య పరికరాలు) పంపిణీకి ఏర్పాట్లు చేసుకోవాలని ఏపీఎంఐపీ ప్రాజెక్టు అధికారి (పీఓ) సీబీ హరినాథరెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన విజయవాడ నుంచి ఏపీఎంఐపీ జిల్లా అధికారి జి.ఫిరోజ్‌ఖాన్, ఎంఐ ఇంజినీర్లు, కంపెనీ డీసీఓలతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ మార్చితో ముగిసిన గత ఆర్థిక సంవత్సరం రాష్ట్రంలోనే అత్యధికంగా 11,079 మంది రైతులకు 13,897 హెక్టార్లకు బిందు, తుంపర సేద్యం పరికరాలు అందించి అనంతపురం జిల్లా మొదటిస్థానంలో నిలిచిందన్నారు. ఇదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా ఐదెకరాల్లోపున్న ఎస్సీ, ఎస్టీ ఇతర రైతులకు 90 శాతం రాయితీ, మిగతా రైతులకు 70 శాతం రాయితీపై డ్రిప్ ఇవ్వాలనారు. ఐదెకరాల్లోపున్న రైతులకు 55 శాతం, ఇతర రైతులకు 45 శాతం రాయితీపై స్ప్రింక్లర్ల పరికరాలు ఇవ్వాలని తెలిపారు. ఆర్‌బీకే వేదికగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న రైతుల్లో సీనియార్టీ వారీగా అందులోనూ ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యత ఇస్తూ పథకం పారదర్శకంగా అమలు చేయాలని ఆదేశించారు. మొదటి విడతగా అనంతపురం జిల్లాకు 12,500 హెక్టార్లకు లక్ష్యం నిర్దేశించినట్లు తెలిపారు. అవసరాన్ని బట్టి టార్గెట్లు సవరిస్తామన్నారు. ప్రాథమిక పరిశీలన, బీఓక్యూ, బీఎంఎస్ తదితర ప్రక్రియ చేపట్టాలన్నారు. గతేడాది మంజూరు చేసి ఇంకా ఇన్‌స్టాల్ చేయకుండా పెండింగ్‌లో ఉన్న వాటిని మే 15లోపు పూర్తి చేయాలని ఆదేశించారు.

అభివృద్ధి పరుగు

- టీడీపీ హయాంలో అభివృద్ధికి నోచుకోని శింగనమల నియోజకవర్గం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాకతో మహర్దశ
- రూ.100 కోట్లతో అధునాతన హంగులు

ఎస్సీ రిజర్వ్‌డ్‌గా ఉన్న శింగనమల నియోజకవర్గం జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్నా.. అభివృద్ధికి దూరంగా ఉండేది. ఇదంతా గతం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక.. ఈ నియోజకవర్గానికి అభివృద్ధి యోగం పట్టింది. ఫలితంగా ఆ ప్రాంత రూపురేఖలు శరవేగంగా మారిపోతున్నాయి. ఎటు చూసినా సుందరమైన రహదారులు.. వివిధ శాఖలకు సంబంధించిన అధునాతన హంగులతో కూడిన భవనాలు, ఊరూరా సరికొత్త మౌలిక వసతులతో అలరారుతోంది. 40 ఏళ్లలో జరగనంత అభివృద్ధిని ఈ నాలుగేళ్లలో జగన్ సర్కార్ చేసి చూపించింది. ఒక్క పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలోనే దాదాపు రూ.100 కోట్ల వ్యయంతో పనులు పూర్తి చేయడం గమనార్హం.

అనంతపురం సిటీ: గత పాలకుల నిర్లక్ష్యానికి శింగనమల నియోజకవర్గం అభివృద్ధికి ఆమడదూరంగా ఉంటూ వచ్చింది. టీడీపీ హయాంలో ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉండేది. కనీస సౌకర్యాలు లేక.. ప్రజలు నరకయాతన పడుతున్నా అప్పటి ప్రజాప్రతినిధులు పట్టించుకోలేదన్న విమర్శలున్నాయి.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటుతో...

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత శింగనమల నియోజకవర్గానికి మహర్దశ చేకూరింది. నియోజకవర్గ అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. తమ ప్రాంత సమస్యలను సీఎం దృష్టికి ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి తీసుకెళ్లిన ప్రతిసారీ ఆయన సానుకూలంగా స్పందిస్తూ వచ్చారు. అవసరమైన నిధులు మంజూరు చేస్తూ 40 ఏళ్లలో జరగని అభివృద్ధిని కేవలం నాలుగేళ్లలోనే చేసి చూపించారు.

రూ.కోట్ల నిధులు విడుదల

శింగనమల నియోజకవర్గ అభివృద్ధికి పంచాయతీరాజ్ శాఖకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 100 కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ నిధులతో నియోజకవర్గంలోని మారుమూల పల్లెల్లోనూ అభివృద్ధి పనులు శరవేగంగా పూర్తి చేశారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో రూ.24.43 కోట్ల వ్యయంతో మొత్తం 87 సచివాలయ భవనాల నిర్మాణాలు చేపట్టగా గడువుకు ముందే 76 భవనాలు పూర్తయ్యాయి. ఒకటి కోర్టు కేసుతో, మరో రెండు స్థల సమస్యతో పనులు ప్రారంభం కాలేదు. మిగిలిన వాటి నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఒక్కో భవన నిర్మాణానికి రూ.40 లక్షలు చొప్పున ఖర్చు పెట్టారు. పూర్తి వ్యవసాయ ఆధారమైన ఈ నియోజకవర్గంలోని రైతులకు వ్యవసాయపరంగా సలహాలు, సూచనలు అందించేందుకు వీలుగా 80 రైతు భరోసా కేంద్రాలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇందులో 64 భవనాలు పూర్తయి జాతికి అంకితం చేశారు. మరో 15 భవనాల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకూ వీటి కోసం రూ.10.79 కోట్లు వెచ్చించారు. అలాగే నియోజకవర్గానికి మొత్తం 36 అంగన్‌వాడీ కేంద్రాలు మంజూరు కాగా, 7 భవనాలు పూర్తయ్యాయి. బల్క్‌మిల్క్ యూనిట్లు, డిజిటల్ లైబ్రరీల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. వివిధ పథకాల కింద వేసిన రహదారులతో గ్రామీణ ప్రాంతాలు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకున్నాయి. రహదారుల నిర్మాణానికి ఇప్పటి వరకూ రూ.5.66 కోట్లు ఖర్చు పెట్టారు. మరో రూ.29.01 కోట్ల వ్యయంతో సీసీ రహదారులు నిర్మించారు.


నార్పల మండలం కేశేపల్లిలో నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం


రూ.4 కోట్లతో నిర్మించిన అనంతపురం-తాడిపత్రి ప్రధాన రహదారి నుంచి సలకంచెరువుకు వెళ్లే రోడ్డు

సీఎం జగనన్న సహకారం మరువలేం



మా నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను సీఎం వైఎస్ జగనన్న దృష్టికి తీసుకెళ్లిన ప్రతిసారీ ఆయన సానుకూలంగా స్పందిస్తూ వచ్చారు. నియోజకవర్గ అభివృద్ధిలో ఆయన సహకారం మర్చిపోలేం.
– జొన్నలగడ్డ పద్మావతి, ఎమ్మెల్యే, శింగనమల

జగన్ రాకతోనే మంచి రోజులు



ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాతనే మా ప్రాంతానికి మంచి రోజులొచ్చాయి. రూ. కోట్లలో నిధులు మంజూరు చేయడంతో నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు తీస్తోంది.
– ఆలూరు సాంబశివారెడ్డి, ప్రభుత్వ సలహాదారు(విద్య)

అందరి సహకారంతోనే



ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు సాంబశివారెడ్డి, కలెక్టర్ , పంచాయతీరాజ్ ఎస్‌ఈ సహకారంతోనే శింగనమల నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపాం. రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా సచివాలయాలు, ఆర్‌బీకేలు, రైతు భరోసా కేంద్రాలను ప్రత్యేకంగా డిజైన్ చేయించి, గడువుకు ముందే నిర్మాణాలు పూర్తి చేశాం.
– ఆర్.భాస్కరరెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, శింగనమల

సంతృప్తికర సేవల్లో ఏపీజీబీ ముందంజ

- నికరలాభం రూ. 595.15 కోట్లు
- నికర విలువ రూ.3,789.26 కోట్లు
- లావాదేవీల్లో 6.11 శాతం వృద్ధి
- ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్


మాట్లాడుతున్న ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్

కడప సెవెన్‌రోడ్స్: ఖాతాదారులకు సంతృప్తికరమైన సేవలు అందించడంలో తమ బ్యాంకు ముందు వరుసలో ఉందని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు చైర్మన్ రాకేష్ కశ్యప్ తెలిపారు. 2022–23 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి గాను సాధించిన ప్రగతిని మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. రూ. 41,656 కోట్ల లావాదేవీలతో రూ. 595.15 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు తెలిపారు. 2021–22 ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే రూ. 2,398.42 కోట్ల అదనపు లావాదేవీలతో 6.11 శాతం వృద్ధి రేటును నమోదు చేసుకున్నట్లు వివరించారు. సీఆర్‌ఏఆర్ చట్టబద్ధమైన లక్ష్యం 9.00 శాతానికి దీటుగా 23.90 శాతం నమోదు కావడంపై హర్షం వ్యక్తం చేశారు. రూ. 3,789.26 కోట్ల నికర విలువలతో దేశంలోనే అత్యధిక నెట్‌వర్క్ కలిగిన గ్రామీణ బ్యాంకుల్లో ఒకటిగా నిలువడం తమకెంతో గర్వకారణంగా ఉందన్నారు. ఖాతాదారులకు ఇంటి వద్దే బ్యాంకు సేవలు అందిస్తున్నామని, 98 ఏటీఎంలు ఏర్పాటు చేశామన్నారు. ప్రాధాన్యత రంగాలకు అందించిన రుణాల స్థాయి రూ. 19,923 కోట్లకు చేరిందన్నారు. వ్యవసాయ రంగానికి రూ. 16,899 కోట్ల రుణాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 45,500 కోట్ల లావాదేవీల లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు తెలిపారు. మొత్తం డిపాజిట్లలో 38 శాతం కాసా డిపాజిట్లను సేకరించనున్నట్లు పేర్కొన్నారు. చిన్న మొత్తాల పొదుపును ప్రోత్సహించడం, పీఎంజేడీవై ఖాతాల్లో లావాదేవీలు నిర్వహించేలా అవగాహన పెంపొందించడం, రికరింగ్ డిపాజిట్లు, రీటైల్ టర్మ్ డిపాజిట్లను విరివిగా ప్రారంభిస్తామన్నారు. ఖాతాదారులకు డిజిటల్ లెండింగ్, సోషల్ బ్యాంకింగ్, యూపీఐ ద్వారా నగదు ఉపసంహరణ తదితర ఆధునిక సాంకేతిక సదుపాయాలు అందుబాటులోకి తెస్తామన్నారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమలకు, ఎంఎస్‌ఎంఈ రంగాలకు, గృహ నిర్మాణం, కొనుగోళ్లకు విస్తృతంగా రుణాలు అందజేస్తామన్నారు. సమావేశంలో బ్యాంకు జీఎంలు జగదీశ్వర్‌రావు, కె.విజయ భాస్కర్, పీఆర్ పడగేటవార్, ఆర్.గిరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి

- మంత్రి ఉషశ్రీ చరణ్


విభిన్న ప్రతిభావంతురాలికి మోటార్ బైక్‌ను పంపిణీ చేస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్


అనంతపురం రూరల్: విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇందు కోసం సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని మంత్రి ఉషశ్రీచరణ్ తెలిపారు. వికలాంగుల ట్రై సైకిల్ శిక్షణా కేంద్రంలో మంగళవారం ఆమె విభిన్న ప్రతిభావంతులకు త్రిచక్ర మోటారు బైక్‌లను అందజేసి, మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో కలెక్టర్ గౌతమి, జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పైలా నరసింహయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ అబ్దుల్‌రసూల్, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి పాల్గొన్నారు.

రేపు భగీరథ జయంతి

అనంతపురం రూరల్: భగీరథ మహర్షి జయంతిని గురువారం అధికారికంగా నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూకొఠారి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని భగీరథ మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి పూజించిన అనంతరం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. కలెక్టర్, ప్రజాప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు.


జేసీ నీకు సిగ్గుందా?

- అభివృద్ధిపై సవాల్‌కు పిలిస్తే తోకముడుస్తావ్
- అధికారుల మీద నిందలు వేయడం మానుకో
- తాడిపత్రి ఎమ్మెల్యే పెద్దారెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి: 'జేసీ ప్రభాకరరెడ్డి నీకు సిగ్గుందా? అసలు మున్సిపాలిటీలో డీజిల్ కుంభకోణం జరిగింది నీ హయాంలో కాదా? ఈ విషయాన్ని కప్పిపెట్టి అధికారులపై నిందలు మోపుతావా?' అంటూ తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ ప్రభాకరరెడ్డిపై ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఫైర్ అయ్యారు. స్థానిక తన నివాసంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాక్షేత్రంలో ప్రాభవాన్ని కోల్పోయిన జేసీ సోదరులు... రాబోవు ఎన్నికల్లో ఎలాగైనా గెలుపొందాలనే లక్ష్యంతో అధికారులు, పోలీసులను బెదిరించి గుప్పిట్లో పెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. తన మాట వినని అధికారులకు అవినీతి మరక అంటించడం జేసీ ప్రభాకర్‌రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. ఒక్కసారి జేసీ ప్రభాకరరెడ్డి గత చరిత్రను పరిశీలిస్తే అక్రమాలు వెల్లువలా వెలుగులోకి వస్తాయన్నారు. మున్సిపల్ చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా జేసీ ప్రభాకరరెడ్డి అధికారంలో ఉన్నప్పుడు డీజిల్ వాడకం ఎంత మేరకు ఉందో... ఇప్పుడు తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత ఎంత మేరకు తగ్గిందో ఒక్కసారి గుర్తించాలన్నారు. అప్పట్లో మున్సిపల్ ఏఈ జయభారత్‌రెడ్డిని దొడ్డిదారిన కమిషనర్‌గా ఏర్పాటు చేయించుకుని మున్సిపాలిటీని నిలువునా దోచేశాడన్నారు. ఈ విషయంపై బహిరంగ చర్చకు తాను సిద్ధమన్నారు. గతంలో తాను సవాల్ చేసిన ప్రతిసారీ జేసీ ప్రభాకరరెడ్డి తోక ముడుస్తూ వచ్చాడన్నారు. ప్రశాంతంగా ఉన్న తాడిపత్రిలో అలజడులు సృష్టించేందుకు అధికారులను లక్ష్యంగా చేసుకుని పావులు కదుపుతుండడం సిగ్గుచేటన్నారు. కాలం చెల్లిన రాజకీయ నేత జేసీ ప్రభాకరరెడ్డి బెదిరింపులకు ఎవరూ భయపడాల్సిన పనిలేదన్నారు. తన అక్రమాలు వెలుగులోకి రాకుండా కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించకుండా రెండు నెలలుగా జాప్యం చేస్తున్నాడన్నారు. ఇప్పటికైనా నీచ రాజకీయాలకు స్వస్తి పలకకపోతే పుట్టగతుల్లేకుండా పోతావని హెచ్చరించారు.

వాహనం ఢీకొని మహిళ మృతి


మృతురాలు బొజ్జమ్మ

వజ్రకరూరు: స్కార్పియో వాహనం ఢీకొన్న ఘటనలో ఓ మహిళ మృతి చెందింది. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లుకు చెందిన సుశీలమ్మ, తిమ్మప్ప దంపతులు. వీరు తమ కుమారుడు భాస్కర్, వరుసకు సోదరియైన కురుబ బొజ్జమ్మ (45)తో కలిసి మంగళవారం వజ్రకరూరు మండలం కొనకొండ్లలో జరిగిన దేవరకు హాజరయ్యారు. సాయంత్రం వేర్వేరు ద్విచక్ర వాహనాలపై గుంతకల్లుకు వెళుతుండగా మార్గమధ్యంలో ఓ ప్రైవేట్ పాఠశాల సమీపంలో వేసిన స్పీడ్ బ్రేకర్ వద్ద వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన స్కార్పియో వాహనం ఢీకొంది. ఘటనలో ద్విచక్ర వాహనాలపై వెళుతున్న నలుగురూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే ఓ ప్రైవేట్ వాహనంలో గుంతకల్లులోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బొజ్జమ్మ మృతిచెందినట్లు నిర్ధారించారు. ఘటనపై తిమ్మప్ప ఫిర్యాదు మేరకు వజ్రకరూరు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఉమ్మడి రాష్ట్ర స్థాయి భజన పోటీలు

ఆత్మకూరు: మండలంలోని వడ్డుపల్లిలో మే 1వ తేదీన ఉమ్మడి తెలుగు రాష్ట్ర స్థాయి భజన పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆ గ్రామ పెద్దలు, గ్రామస్తులు మంగళవారం తెలిపారు. విజేతలుగా తొలి 12 స్థానాల్లో నిలిచిన భజన బృందాలకు నగదు పురస్కారాలతో సత్కరించనున్నారు. పూర్తి వివరాలకు 94935 00460, 99594 13224లో సంప్రదించవచ్చు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి

- జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ


ఫ్రీజర్‌ను ప్రారంభిస్తున్న గిరిజమ్మ (చిత్రంలో) కాపు భారతి


అనంతపురం సప్తగిరి సర్కిల్: ఆపద సమయంలో ప్రాణాలు నిలిపేందుకు అవసరమైన రక్తాన్ని దానం చేసేందుకు ముందుకు రావాలని యువతకు జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ పిలుపునిచ్చారు. స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో నూతన పరికరాలను సొసైటీ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతితో కలసి మంగళవారం ఆమె ప్రారంభించి, మాట్లాడారు. కాపు భారతి మాట్లాడుతూ... జిల్లాలో రక్త నిల్వలను పెంచేందుకు పరిశ్రమలు, విద్యా సంస్థల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున శిబిరాలను నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రెడ్‌క్రాస్ సంస్థ పరిశుభ్రతకు ముందుకు వచ్చిన ఎస్‌ఆర్‌ఐటీ విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో సప్తగిరి క్యాంఫర్ ఎండీ హనీఫ్, ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ సురేంద్ర, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న, జిల్లా కో–ఆపరేటివ్ ఆఫీసర్ ప్రభాకరరెడ్డి, మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కింద పడి బాలుడి మృతి


శివదర్శన్ (ఫైల్)

కణేకల్లు: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి ఓ బాలుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... కణేకల్లు మండలం కోకుర్తి గ్రామానికి చెందిన గంగమ్మ, వన్నూరుస్వామి దంపతులకు ఓ కుమార్తె, కుమారుడు శివదర్శన్ (6) ఉన్నారు. మంగళవారం సాయంత్రం ఇంటి ఎదురుగా ఆడుకుంటూ ఎరువు తరలిస్తున్న ట్రాక్టర్ ట్రాలీ కిందకు ఉన్నఫళంగా దూరాడు. ఘటనలో ట్రాలీ చక్రం దూసుకెళ్లడంతో శివదర్శన్ తల ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ట్రాక్టర్ డ్రైవర్ శ్రీకాంతరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టారు.

భార్యను హతమార్చిన భర్త


శిరీష మృతదేహం

పెద్దపప్పూరు: అనుమానం పెనుభూతమై కట్టుకున్న ఇల్లాలిని దారుణంగా హతమార్చాడు ఓ భర్త. అనంతరం నేరుగా పోలీసు స్టేషన్‌కు చేరుకుని లొంగిపోయాడు. వివరాలు... పెద్దపప్పూరులోని సుంకులమ్మ కాలనీకి చెందిన రామాంజులరెడ్డి, శిరీష (23) దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొన్ని నెలలుగా భార్య ప్రవర్తనపై రామాంజులరెడ్డికి అనుమానాలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో పలు దఫాలు ఆమెతో గొడవపడుతూ వచ్చాడు. అనుమానం మరింత పెరగడంతో విచక్షణ కోల్పోయి మంగళవారం దిండుతో గొంతు నులిమి ఊపిరి ఆడకుండా చేసి హతమార్చాడు. అనంతరం పోలీసు స్టేషన్‌కు చేరుకుని తన భార్యను హతమార్చినట్లు నేరం అంగీకరించి లొంగిపోయాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

30న ఎస్పీబీకి స్వర నివాళి



ఫ్లెక్సీని విడుదల చేస్తున్న డీఈఓ సాయిరామ్

రాప్తాడురూరల్: గాన గంధర్వుడు స్వర్గీయ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు అనంత ఉపాధ్యాయ కళా సమితి ఆధ్వర్యంలో ఈనెల 30న లలితా కళా పరిషత్‌లో స్వర నివాళి కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమ ఫ్లెక్సీలను డీఈఓ సాయి రామ్ చేతుల మీదుగా మంగళవారం విడుదల చేశారు. డీఈఓ పర్యవేక్షణలో గాయకులు (ఉపాధ్యాయులు) ఎస్పీబీ సినీగీతాలను ఆలపించి స్వరనీరాజనం అర్పిస్తారని అనంత ఉపాధ్యాయ కళా సమితి అధ్యక్షులు బాలామురళీకృష్ణ (హెచ్ఎం), కార్యదర్శి రామాంజి (టీచరు) తెలిపారు. పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ గోవిందునాయక్, గుత్తి డిప్యూటీ డీఈఓ శంకర ప్రసాద్, ఉపాధ్యాయ కళాకారులు వివేకానంద, చంద్రమౌళి, శ్రీదేవి, విజయలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు చంద్ర శేఖర్, లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

సేవాభావంతోనే సార్థకత



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

అనంతపురం సిటీ: సేవాభావంతోనే జీవితానికి సార్థకత చేకూరుతుందని ఉమ్మడి జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలో తమ శాఖ తరఫున ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆమె మంగళవారం ప్రారంభించారు. ఇదే స్ఫూర్తితో అన్ని శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుకు రావాలని కోరారు. ఎండలు తగ్గేంత వరకు రక్షిత మంచినీటిని అందుబాటులో ఉంచాలని సీఈఓ భాస్కర్‌రెడ్డికి సూచించారు. జెడ్పీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మర్తాడు షేక్ రఫీ, ఏఓలు, జెడ్పీ ఉద్యోగులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



ధర్నాలో మాట్లాడుతున్న ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ దివాకర్‌రావు

అనంతపురం అర్బన్: కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా చైర్మన్ దివాకర్‌రావు, ప్రధాన కార్యదర్శి పీఎస్ ఖాన్ మాట్లాడారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకుడు ఓబుళు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగమణి, నాగేంద్రకుమార్, నగర కార్యదర్శి వెంకటనారాయణ, పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం



మంటల్లో దగ్ధమవుతున్న గడ్డివామి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం పూలకుంటలో ట్రాన్స్‌ఫార్మర్‌పైన ఓ పక్షి పడడంతో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి, వరిగడ్డి వామి, వేరుశనగర కట్టె కాలిపోయింది. వివరాలు.. గ్రామానికి చెందిన సుంకర శంకర్‌రెడ్డి తోట సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌పైన కొంగ వచ్చి పడింది. కరెంటు తీగల మధ్య పడడంతో పెద్ద ఎత్తున శబ్దం వచ్చి మంటలు చెలరేగాయి. నిప్పురాజుకొని సమీపంలో ఉన్న శంకర్‌రెడ్డి గడ్డివామి, వేరుశనగకట్టె వాములపై పడ్డాయి. దీంతో మంటలు నిమిషాల్లోనే వ్యాపించాయి. సుమారు ఐదు వాములు పూర్తిగా కాలిపోయాయి. అగ్నిమాపక ఇబ్బంది ఫైరింజన్‌తో వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. లేదంటే సమీపంలో మరింత ప్రమాదం సంభవించేదని రైతులు చెప్పారు. రూ.లక్ష నష్టం జరిగినట్లు బాధిత రైతులు తెలిపాడు.

బీమా తక్షణసాయం అందజేత

రాప్తాడు: బుక్కచెర్ల గ్రామానికి చెందిన ఈడిగ వెంకటస్వామి (65) ఈ నెల 23న రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద మృతుడి భార్య ఈడిగ లక్ష్మీదేవికి సర్పంచు ఆదినారాయణమ్మ, వెల్ఫేర్ అసిస్టెంట్ కేవీ తనూజా, పంచాయతీ కార్యదర్శి రామచంద్రారెడ్డి రూ.10 వేలు నగదును మంగళవారం అందజేశారు. ఏఎన్ఎం శ్రీలత, వలంటీరు గంగాధర్‌రెడ్డి వలంటీర్లు పాల్గొన్నారు.

మే 5 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్

ఆత్మకూరు: ఆత్మకూరు జెడ్పీహెచ్ఎస్ క్రీడామైదానంలో వచ్చే నెల 5 నుంచి అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల టెన్నిస్ బాల్ ఆధార్‌కార్డు మెగా ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. మే నెల 3వ తేదీ లోపు ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. వివరాలకు సెల్: 9052796786, 6300171445 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ధర్మాచరణతోనే ఉత్తమ జీవితం



పీఠపూజలు చేస్తున్న స్వామీజీలు



కలశ పూజల్లో పాల్గొన్న శ్రీపాద శ్రీసుజయనిధి స్వామి

- ముళబాగిల పీఠాధిపతులు శ్రీసుజయనిధి శ్రీపాదులు

అనంతపురం కల్చరల్: ధర్మాచరణ, భక్తిమార్గాలతోనే ఉత్తమ జీవితం ప్రాప్తిస్తుందని ముళబాగిల పీఠాధిపతులు శ్రీసుజయనిధి శ్రీపాదుల స్వామీజీ పేర్కొన్నారు. మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండరామాలయం శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం స్వామీజీ విశిష్ట అతిథిగా హాజరై, అనుగ్రహ భాషణం చేశారు. ఉదయం ఆలయ అనువంశీకులు హోసూరు రామసుబ్రమణ్యం నేతృత్వంలో వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన 50 మంది వేదపండితులు శ్రీసూక్తం, మన్యుసూక్తం, అరుణ హోమాలు, సాయంత్రం దీక్షా హోమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. మహాశివునికి ఏకవార రుద్రాభిషేకాలు, భస్మార్చన జరిగాయి. అనంతరం స్వామీజీ సమక్షంలో సామూహిక విష్ణు సహస్రనామ, లలితా పారాయణం చేశారు. అనంతరం స్వామీజీ ధర్మమార్గంపై ప్రసంగం చేశారు. స్వామీజీ స్వయంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రమేష్‌బాబు, ప్రధాన అర్చకులు నరసింహశాస్త్రి, ధర్మకర్తల మండలి సభ్యులు సుబ్రమణ్యం, సురేష్‌కుమార్, తిమ్మారెడ్డి, వెంకటస్వామి, నళిని, రాజేశ్వరి, కల్పన తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శంకర జయంతి వేడుకలు



శంకర రథోత్సవ దృశ్యం

అనంతపురం కల్చరల్: అద్వైత సిద్ధాంతంతో హైందవ ధర్మాన్ని కాపాడిన ఆది శంకర భగవత్పాదుల జయంతి వేడుకలు మంగళవారం పలు చోట్ల ఘనంగా జరిగాయి. మొదటిరోడ్డులోని శంకర మఠంలో ఉదయం శారదామాత సమేత స్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష పుష్పాలంకార సేవలు జరిగాయి. అనంతరం ఉపనయన సేవాసమితి ఆధ్వర్యంలో పురవీధుల్లో శంకరుల ఉత్సవ విగ్రహాలతో మేళతాళాల నడుమ ఊరేగించారు. శారదానగర్‌లోని శృంగేరి శంకర మఠంలో శంకర జయంతి వేడుకలు పెద్దఎత్తున జరిగాయి. మఠం మేనేజర్ సత్య ప్రసాద్ శంకరుల జీవితాన్ని వివరించారు. సాయంత్రం నగరోత్సవం కనుల పండువగా జరిగింది.

కట్టకిందపల్లికి రాష్ట్రస్థాయి అవార్డు



పీఆర్ కమిషనర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్ శోభ

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కట్టకిందపల్లి పంచాయతీ 'సెల్ఫ్ సఫిషియంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పంచాయతీ' విభాగంలో రాష్ట్రస్థాయి అవార్డు దక్కించుకుంది. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా విజయవాడలో జరిగిన కార్యక్రమంలో పంచాయతీరాజ్ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్యకుమారి చేతుల మీదుగా సర్పంచ్ శోభ అవార్డు అందుకుంది. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ గిరిజమ్మ, జిల్లా పరిషత్, అధికారులు, నాయకులకు సర్పంచ్ ధన్యవాదాలు తెలిపారు.

ఖైదీల స్థితిగతులపై ఆరా

అనంతపురం: న్యాయ సేవ ప్రాధికార సంస్థ జిల్లా కార్యదర్శి గరికపాటి దీనబాబు అనంతపురం జిల్లా జైలును మంగళవారం సందర్శించారు. జిల్లా జైలు ఖైదీలతో మాట్లాడి వారి బాగోగులను తెలుసుకున్నారు. ఖైదీల ఆహారం, వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఖైదీలకు అందిస్తున్న సౌకర్యాలను జైలు అధికారులతో వాకబు చేశారు. న్యాయ సేవల లభ్యత, అప్పీల్ హక్కు, న్యాయ సహాయం పని తీరు తదితర అంశాలపై ఖైదీలకు వివరించారు.

వైద్యాధికారిపై చర్యలు తీసుకోండి

అనంతపురం సప్తగిరి సర్కిల్: బేతాపల్లి వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ వీరబ్బాయిని ఎన్జీఓ సంఘం, బేతాపల్లి ఉద్యోగులు స్థానిక కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తూ వారిని మానసికంగా హింసకు గురి చేస్తున్నాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీఓ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ, జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, జిల్లా సహ అధ్యక్షులు వెంకటేష్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్, జమీలాబేగం, జిల్లా కోశాధికారి బషీర్ అహమ్మద్, సిటీ అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, గుత్తి తాలూకా అధ్యక్షులు శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, బేతాపల్లి వైద్యా సిబ్బంది పాల్గొన్నారు.

ఇదరు టీచర్లకు బదిలీలు

రాప్తాడురూరల్: ఉమ్మడి జిల్లాలో ఇద్దరు టీచర్లను కోర్టు ఆదేశాలు, కమిషనర్ ఉత్తర్వుల మేరకు అంతర్ జిల్లా బదిలీలు చేశారు. ప్రకాశం జిల్లాలో బయాలజీ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న బి.రామకృష్ణ, కర్నూలు జిల్లాలో బయాలజీ అసిస్టెంట్‌గా పని చేస్తున్న జి.లలిత గతంలో అంతర్ జిల్లా బదిలీల్లో జిల్లాకు వచ్చారు. అయితే నిబంధనల మేరకు కేటగిరి 3, 4 పాఠశాలల్లో ఖాళీలను మాత్రం చూపించారు. రామకృష్ణ గుడిబండ మండలం జంబులదిన్నె జెడ్పీహెచ్ఎస్‌ను కోరుకోగా, లలిత మాత్రం చేరకుండా వెనక్కు వెళ్లిపోయారు. స్పౌజ్‌గా ఉన్న వీరిద్దరూ కోర్టుకు వెళ్లారు. స్పౌజ్‌కు దగ్గర్లో ఉన్న ఖాళీల్లో నియమించాలని ఆదేశించడంతో రామకృష్ణను పుట్టపర్తి మండలం ఎనుమలపల్లి జెడ్పీహెచ్ఎస్, లలితను అనంతపురం రూరల్ మండలం పాపంపేట జెడ్పీహెచ్ఎస్‌కు బదిలీ చేస్తూ డీఈఓ సాయిరామ్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే హామీ



ఎమ్మెల్యే అనంతను కలిసిన బీఎస్ఎన్ఎల్, తపాలా ఉద్యోగులు, యూనియన్ల ప్రతినిధులు

అనంతపురం సిటీ: అనంతపురం టవర్‌క్లాక్ సమీపంలో చేపట్టిన ఫ్లై ఓవర్ నిర్మాణం నేపథ్యంలో బీఎస్ఎన్ఎల్, తపాలా కార్యాలయాల వైపున అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి హామీ ఇచ్చారు. బీఎస్ఎన్ఎల్, తపాలా శాఖ ఉద్యోగులు, యూనియన్ల ప్రతినిధులు అనంత వెంకట్రామిరెడ్డిని ఆయన నివాసంలో మంగళవారం కలిసి సమస్య విన్నవించారు. వారు మాట్లాడుతూ తమ కార్యాలయాల వైపు జేసీబీలతో పెద్ద గుంతలు తవ్వేయడంతో పాటు పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని, కార్యాలయాల పనిమీద వచ్చేవారు ఇబ్బంది పడుతున్నారన్నారు. మూడు నెలలుగా ఇదే పరిస్థితి ఉన్నా, వృద్ధులు, చిన్న పిల్లలు, బాలింతలు, గర్భిణుల పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. ఉద్యోగినులు కార్యాలయాలకు చేరుకోవాలంటే అష్టకష్టాలు పడాల్సి వస్తోందన్నారు. ఎమ్మెల్యే అనంత సానుకూలంగా స్పందించారు. సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

బీటీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



లక్ష్మీనగర్‌లో పనులను పరిశీలిస్తున్న మేయర్

అనంతపురం క్రైం: నగరంలోని 39వ డివిజన్‌లోని లక్ష్మీనగర్‌లో రూ.1.20 కోట్లతో జరుగుతున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను మేయర్ వసీం మంగళవారం పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలతో పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీర్లను ఆదేశించారు. పనులు జరిగే సమయంలో ఏఈ, అమినిటీ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు అందుబాటులో ఉండాలన్నారు. ఈ పనులు పూర్తయితే నగరంలోని దాదాపుగా 36 డివిజన్లలో అపరిష్కృత సమస్యలు పరిష్కారమయినట్లు అవుతుందన్నారు. ఏఈ శంకర్, వైఎస్సార్ సీపీ నాయకులు చింతకుంట మధు, రఫీ, శంకర్ పాల్గొన్నారు.

కాలువలపై నిర్మాణాలు చేపట్టినా పట్టదా?

కాలువకు ఆనుకొని నిర్మాణాలు చేపడుతున్నా పట్టించుకోరా? అని పట్టణ ప్రణాళిక కార్యదర్శి నరేష్‌పై కమిషనర్ రమణారెడ్డి మండిపడ్డారు. మంగళవారం నగరంలోని హౌసింగ్ బోర్డులో కమిషనర్ పర్యటించారు. కాలువకు ఆనుకొని చేపడుతున్న నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ప్రారంభ దశలోనే ఇలాంటి నిర్మాణాలను ఎందుకు గుర్తించలేదని ప్రశ్నించారు. కాలువకు ఆనుకొని వేసిన పిల్లర్లను తక్షణం తొలగించాలని కార్యదర్శి నరేష్‌ను ఆదేశించారు. రాజీవ్ చిల్డ్రన్స్ పార్క్ నుంచి వెంకటేశ్వర స్వామి ఆలయం వైపుగా నిర్మించే కాలువ, ఇండేన్ గ్యాస్ వెనుకవైపు కాలువలను పరిశీలించారు.

ముగ్గురికి మెమో: హౌసింగ్ బోర్డులో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేపట్టినా ప్రేక్షకపాత్ర వహిస్తున్న బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్, పట్టణ ప్రణాళిక కార్యదర్శి, లైసెన్స్ టెక్నికల్ పర్సన్‌కు మెమో జారీ చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. అంతకుముందు కోవూర్‌నగర్‌లోని హెర్బల్ పార్క్‌ను పరిశీలించి, స్థానికులతో మాట్లాడారు. హెర్బల్‌పార్కు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా ఉందని స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సీఐ జాకీర్ హుస్సేన్‌కు ఫోన్ చేసి సమస్య వివరించారు. కమిషనర్ వెంట ఈఈ చంద్రశేఖర్, ఏఈలు బాబా, సాయి, తదితరులు ఉన్నారు.

ఇన్‌చార్జ్ ఏసీపీగా హరిప్రసాద్

అనంతపురం క్రైం: నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ విభాగం ఇన్‌చార్జ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా అహుడా ప్లానింగ్ ఆఫీసర్‌గా ఉన్న హరిప్రసాద్ నియమితులయ్యారు. ఏసీపీ శ్రీనివాసులురెడ్డి నెల రోజుల పాటు సెలవులో వెళ్లిన విషయం విదితమే. వచ్చే నెల 9 వరకు హరిప్రసాద్ ఏసీపీగా కొనసాగనున్నారు.

ఐక్యతతోనే నాయీబ్రాహ్మణుల రాణింపు

- నాయీబ్రహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు నరసింహులు



మాట్లాడుతున్న నాయీ బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు

అనంతపురం టవర్‌క్లాక్: నాయీ బ్రాహ్మణులు ఐక్యతగా ఉంటేనే అన్ని రంగాల్లో రాణిస్తారని నాయీబ్రహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు నరసింహులు అన్నారు. మంగళవారం స్థానిక జయమణెమ్మ కళ్యాణ మంటపంలో సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులు తమ పిల్లలను తప్పనిసరిగా ఉన్నత చదువులు చదివించాలన్నారు. ఐక్యతతో ఉండి మనకు రావాల్సిన హక్కులు, సంక్షేమ ఫలాలు అమలు జరిగేలా పోరాడి సాధించుకోవాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. నాయీబ్రహ్మణ సేవా సంఘం అధ్యక్షుడిగా చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా నాగేంద్ర, శివకుమార్, కోశాధికారిగా రాజు, సహాయకార్యదర్శి మనోజ్‌ను ఎంపిక చేశారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డిష్ శీనా, నాయకులు విజయభాస్కర్, బాలయ్య, రామకృష్ణ, బంకుశీనా, అంజి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంతో చెలగాటమాడితే ఉపేక్షించేదిలేదు



కొట్టాలపల్లిలో చెర్రీస్ తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్

అనంతపురం క్రైం: కనీస శుభ్రత పాటించకుండా ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే ఉపేక్షించేది లేదని అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కళ్యాణ చక్రవర్తి నిర్వాహకులను హెచ్చరించారు. మంగళవారం బుక్కరాయసముద్రం కొట్టాలపల్లిలోని ఓ చెర్రీస్ కేంద్రాన్ని ఫుడ్ సేఫ్టీ అధికారి పీ తస్లీంతో కలిసి అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బొప్పాయతో చెర్రీస్ తయారీలో సురక్షిత ప్రమాణాలు పాటించలేదని అధికారుల తనిఖీలో తేలింది. ఆహార తయారీ కేంద్రాలు తప్పక పరిశుభ్రత ప్రమాణాలు పాటించాలన్నారు. ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) లైసెన్స్ లేకుండా చెర్రీస్ తయారీ కేంద్రాన్ని ఏవిధంగా నిర్వహిస్తున్నారని, నిర్వాహకులకు ఆయన నోటీసులు జారీ చేశారు. లైసెన్స్, పరిశుభ్రత పాటించని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చిరుధాన్యాల సాగుతో లాభాలు బాగు



చిరుధాన్యాల పంటలపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

ఆత్మకూరు: ప్రస్తుతం అన్ని చోట్ల చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెరుగుతోందని, చిన్నకారు రైతులు ఎక్కువగా చిరు ధాన్యాల సాగుపై ఆసక్తి చూపుతున్నారని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శైలజ కుమారి తెలిపారు. మంగళవారం ఆత్మకూరు సమీపంలో చిరుధాన్యాల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఏడాది అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించినట్లు తెలిపారు. తక్కువ నీటితో, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించొచ్చని తెలిపారు. రాబోవు ఖరీఫ్‌లో కొర్రలు, అరికలు, జొన్నలు, సజ్జలు అన్ని కలిపి వేసుకోవడం ద్వారా ఒక పంటలో దిగుబడి తగ్గినా మరో పంటలో పెరుగుతుందన్నారు. పంట మార్పిడి చేసి చిరుధాన్యాలు వేసుకోవాలని సూచించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడితే మంచి దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఓలు శంకర్‌లాల్, వెంకటేశ్వర ప్రసాద్, డీడీఏ మద్దిలేటి, ఏఈఓ సుజిత, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మలేరియా నివారణే లక్ష్యం



ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

అనంతపురం సప్తగిరి సర్కిల్: మలేరియా వ్యాధి నివారణే ప్రధాన లక్ష్యమని జిల్లా మలేరియా అధికారి ఓబులు ఆకాంక్షించారు. మంగళవారం స్థానిక కురుగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన కల్పించారు. జిల్లా మలేరియా అధికారి ఓబులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఫ్రైడే డ్రైడేను తప్పనిసరిగా పాటించాలన్నారు. 2027 నాటికి మలేరియా వ్యాధిని ఎలిమినేషన్ స్థాయికి, 2030 నాటికి మలేరియా వ్యాధి పూర్తి నివారణే లక్ష్యంగా చేసుకొని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి సత్యనారాయణ, డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ గణేష్, ఎంపీహెచ్ఈఓ రవీంద్రారెడ్డి, సిబ్బంది పద్మావతి, భారతి, సుధారాణి పాల్గొన్నారు.

మలేరియాను తరిమేద్దాం

రాప్తాడు: మలేరియా రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు కదలాలని పీహెచ్‌సీ వైద్యాధికారి శివకృష్ణ పిలుపునిచ్చారు. మంగళవారం ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ మలేరియాపై అవగాహన అవసరమన్నారు. మలేరియా బారిన పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ దోమ తెరలువాడాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ అరుణమ్మ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గావుల మహోత్సవం



గావుల మహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

కనగానపల్లి: మండలంలోని మామిళ్లపల్లిలో పోతలయ్య స్వామి గావుల మహోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఐదేళ్లకోసారి నిర్వహించనున్న ఉత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఉదయం గ్రామంలోని వందలాది మంది మహిళలు, యువతులు జ్యోతులు ఎత్తుకొని ఊరేగింపుగా వచ్చి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అనంతరం స్వామి కాపులు తెచ్చిన మేకపోతు పిల్లను పోతురాజులు బలి ఇచ్చి రక్తతర్పనం చేశారు. ఎస్ఐ హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

'భూకబ్జాలపై విచారణ జరిపించాలి'

అనంతపురం అర్బన్: జిల్లాలో ప్రభుత్వ భూముల కబ్జాపై సమగ్ర విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సీపీఎం లేఖ రాసింది. ఈ లేఖను స్థానిక గణేనాయక్ భవన్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ మంగళవారం విడుదల చేశారు. రాంభూపాల్ మాట్లాడుతూ అనంతపురం రూరల్ మండలం రాజీవ్ కాలనీ పంచాయతీ, గార్లదిన్నె, కల్లూరు అగ్రహారం, బుక్కరాయసముద్రం మండల కేంద్రం, కూడేరు మండలం బ్రాహ్మణపల్లి పంచాయతీ, శింగనమల మండలం, గుత్తి మండలం, పెద్దవడుగూరు, పామిడి మండల కేంద్రాల్లో ప్రభుత్వ భూమి కబ్జా కాకుండా చూడాలని ఆయన కోరారు.

సంక్షిప్త సమాచారం

స్పందించి ...సాయం అందించారు



ఆర్డీటీ ప్రతినిధులకు చెక్కు అందిస్తున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సి. జయచంద్రారెడ్డి

అనంతపురం: ఆర్డీటీ తలపెట్టిన స్పందించు..సాయం అందించు కార్యక్రమానికి అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు రూ.70 వేలు విరాళంగా ప్రకటించారు. ఈ మెత్తాన్ని ఆర్డీటీ రీసెర్చ్ అసిస్టెంట్ సావిత్రికి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, అనంతపురం ప్రిన్సిపాల్ సి.జయచంద్రా రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

మే 3న ఉచిత ఖత్నా

అనంతపురం సప్తగిరి సర్కిల్: నగరంలోని ఆజం ఫంక్షన్ హాల్, నాల్బంద్ వీధి, పాతూరులో ఆస్తానే ఖాద్రీయా ఆధ్వర్యంలో మే 3న ఉచిత ఖత్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మహబూబ్‌బాషా, ఫక్రుద్దీన్ తెలిపారు. వివరాలకు సెల్: 94415 67717, 94414 99515 లో సంప్రదించాలన్నారు.

ఎకరాకు రూ.45 వేలు పెంచాలి

ఆత్మకూరు: స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కింద ఎకరాకు రూ.45 వేలు పంటరుణం మంజూరు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి బ్యాంకర్లను కోరారు. మంగళవారం స్థానిక కెనెరా బ్యాంక్ వద్ద ఏపీ రైతు సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా ధర్నా చేశారు. రైతు సంఘ నాయకులు రాము, శివశంకర్, వలి, జయమ్మ, సరస్వతమ్మ పాల్గొన్నారు.

అనారోగ్యంతో తైక్వాండో కోచ్ మృతి

అనంతపురం సప్తగిరి సర్కిల్: తైక్వాండో కోచ్ మహమ్మద్ బిన్ కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. కొద్ది రోజులుగా పచ్చ కామెర్లతో బాధపడుతున్న అతన్ని.. కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి శాంతరాజ్ తెలిపారు.

పది 'స్పాట్' కేంద్రం వద్ద 'ఫ్యాప్టో' నిరసన

రాప్తాడురూరల్: అనంతపురంలోని పదో తరగతి మూల్యాంకనం కేంద్రం బయట విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ వైఖరిని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో నల్ల బాడ్జీలు ధరించి మంగళవారం నిరసన తెలియజేశారు. నాయకులు మాట్లాడుతూ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ మన్యం జిల్లాలో చేసిన జిల్లా అధికారుల సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఎస్.సిరాజుద్దీన్, సెక్రటరీ జనరల్ లింగమూర్తి డిప్యూటీ సెక్రటరీ జనరల్ నీలూరు రమణారెడ్డి, రవీంద్ర, నాయకులు పాల్గొన్నారు.

హజ్‌యాత్రలో నియమాలపై అవగాహన

అనంతపురం సప్తగిరి సర్కిల్: హజ్ యాత్రలో నియమాలపై ప్రభుత్వ ఖ్వాజీ మౌలానా హారూన్ రషీద్ అవగాహన కల్పించారు. మంగళవారం స్థానిక పీటీసీ ఎదుట ఉన్న చాందినీ మసీదులో గుత్తి, ఉరవకొండ, పామిడి, అనంతపురం యాత్రికులకు అవగాహన కల్పించారు.

29న సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక

అనంతపురం సప్తగిరి సర్కిల్: స్థానిక ఆర్డీటీ క్రీడామైదానంలో ఈ నెల 29న జిల్లా జూనియర్ సాఫ్ట్‌బాల్ బాల, బాలికల జట్ల ఎంపికలను చేపట్టనున్నారు. ఈ మేరకు రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈఓ వెంకటేశులు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఎంపికల ప్రక్రియకు క్రీడాకారులు ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణపత్రం, ఫొటోలతో హాజరు కావాలి. జట్టుకు ఎంపికైన క్రీడాకారులు మే 26 నుంచి 28వ తేదీ వరకూ అన్నమయ్య జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

గణిత ఫోరం నూతన కార్యవర్గం ఎన్నిక

రాప్తాడు రూరల్: జిల్లా గణిత ఫోరం ఏకగ్రీవంగా ఎన్నికైంది. మంగళవారం అనంతపురంలోని కేఎస్ఆర్ బాలిక ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయులు సమావేశమై కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కె.వెంకటేశులు, ప్రధానకార్యదర్శిగా ఎం.శివప్రసాద్, గౌరవాధ్యక్షులుగా నీలూరు రమణారెడ్డి, వెంకట్, గౌరవ సలహాదారుగా ఈశ్వరయ్య, కోశాధికారిగా డేగావత్ రవీంద్రనాథ్, ఉపాధ్యక్షులుగా ఎస్. చాంద్‌మిషా, శివశంకర్, అదనపు ప్రధాన కార్యదర్శులుగా ఎ.ఖాజాబాషా, ఆంజనేయులు, జిల్లా కౌన్సిలర్లుగా జయరాంనాయక్, వీరన్న, ఎం.శ్రీనివాసులు, కేవీ శోభన్ బాబు, చంద్రశేఖర్, ప్రతాప్, మహిళా కార్యదర్శిగా రాధిక ఎన్నికయ్యారు.

డీఎంఐఓగా ఫిరోజ్‌ఖాన్

అనంతపురం అగ్రికల్చర్: ఏపీఎంఐపీ జిల్లా అధికారి (ఎఫ్ఏసీ)గా ఉన్న జి.ఫిరోజ్‌ఖాన్... డిస్ట్రిక్ మైక్రో ఇరిగేషన్ ఆఫీసర్ (డీఎంఐఓ) రెగ్యులర్ అధికారిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఉద్యానశాఖ కమిషనరేట్ నుంచి మంగళవారం ఉత్తర్వులు అందాయి. దీంతో ఆయన మరోసారి బాధ్యతలు స్వీకరించారు.

'మోదీని గద్దె దింపండి'

అనంతపురం అర్బన్: ప్రధాని నరేంద్రమోదీని గద్దె దింపాలంటూ ప్రజలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాబూరావు పిలుపునిచ్చారు. అనంతపురంలోని పాతూరు బ్రహ్మంగారి గుడి వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన బహిరంగసభలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణతో కలసి ఆయన ప్రసంగించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్, సీపీఎం రాష్ట్ర నాయకుడు ఓబుళు, సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు రాంభూపాల్, జాఫర్, తదితరులు పాల్గొన్నారు.